# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఎస్.సవిత తెలిపారు.
- తలసేమియా వ్యాధితో బాధపడుతున్న రోగులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.
- జాతీయ భద్రత వారోత్సవాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈరోజు విజయవాడలో ప్రారంభించారు.

====================

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో తొలిసారి విద్యా, ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించామన్నరు. ఆడబిడ్డ పుడితే 5 వేలు రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశామన్నారు. డీలిమిటేషన్ పూర్తయితే సుమారు 75 మంది మహిళలు అసెంబ్లీకి వస్తారని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

====================

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న రోగులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తలసీమియా రోగులకు అందుతున్న చికిత్స, ఆర్థిక సాయం వంటి అంశాలపై ఈరోజు శాసనసభలో బిజెపి శాసన సభసభ్యుడు విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ... తలసీమియా రోగులకు సంబంధించి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రక్తకేంద్రాల వద్ద అవసరమైన రక్తం యూనిట్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని చెప్పారు.

====================

గత ప్రభుత్వ కాలంలో జరిపిన రీ-సర్వేలో తలెత్తిన సమస్యలను దాదాపు 98 శాతం పైగా పరిష్కరించామని రాష్ట్ర రెవెన్యూ, శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శాసనసభలో రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి ఈరోజు సమాధానమిస్తూ... ఒకే ఎల్పీఎమ్ లో వేర్వేరు భూ యజమానులు ఉండడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయని, భూ యజమానులు ఇబ్బంది లేకుండా తమ భూములను సబ్ డివిజన్ చేయించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇప్పటివరకు సబ్ డివిజన్ కోసం 85 వేల 571 దరఖాస్తులు రాగా, 69 వేల 142 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యల కారణంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం రైతులు, భూయజమానులు తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 33 సెకన్లు)

====================

జాతీయ భద్రత వారోత్సవాలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈరోజు విజయవాడలో జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని కార్మికులతో పాటు సామాన్య ప్రజానీకానికి భద్రత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యకరమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 54వ జాతీయ భద్రత వారోత్సవాలు సేఫ్టీ అండ్ వెల్ బీయింగ్ క్రూషియల్ ఫర్ వికసిత్ భారత్ 2047 అనే నినాదంతో ప్రారంభించబడిందన్నారు. యాజమాన్యాలు కార్మికులు, ప్రభుత్వ యంత్రాంగం అందరూ కలిసి జీరో యాక్సిడెంట్స్ అనే నినాదంతోనే ముందుకు వెళ్లాల్సిందిగా మంత్రి కోరారు.

విరామం

====================

చేనేత కార్మికులతో పాటు డ్వాక్రా సంఘాల్లో చేనేత వృత్తిలో ఉండే మహిళలకు నాణ్యమైన నూలును 15 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈరోజు శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. నూలుపై సబ్సిడీతో పాటు 1 నుంచి 10 శాతం రవాణా సబ్సిడీ కూడా అందజేస్తున్నామన్నారు. జ్యూట్/కాయర్ నూలుపై 10 శాతం, పట్టు నూలుపై ఒక శాతం, సాధారణ అమ్మకాలపై 2.5 శాతం రవాణా సబ్సిడీ ఇస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ పథకం కింద చేనేత, డ్వాకా మహిళలతో పాటు సహకార సంఘాలు, సంయుక్త బాధ్యతా గ్రూపుల సభ్యులతో పాటు వ్యాపారులకు కూడా ఈ సబ్సిడీ అందజేస్తున్నామని మంత్రి సవిత తెలియజేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

====================

అధిక ఆదాయం సాధించేందుకు రైతులు పూల సాగుపై దృష్టి సారించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. ఈరోజు భీమవరం లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పూలసాగు, ఉద్యాన విలువ ఆధారిత ఉత్పత్తులపై అవగాహన సదస్సులో పూల ప్రదర్శనను తిలకించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సింగపూర్, మలేషియా దేశాలతో పాటు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హైదరాబాద్, రాయలసీమ, కడియం పూల సాగుకు ప్రసిద్ధిగాంచడంతో పాటు, అక్కడి రైతులు అధిక లాభాలను ఆర్జిస్తున్నారని అన్నారు. జిల్లాలో ఎక్కువ నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను గుర్తించి పూల్ మకానా సాగుకు దృష్టి సారించాలన్నారు.

====================

పిల్లలు, కౌమార బాలికలు, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడానికి కేంద్రప్రభుత్వం ప్రారంభించిన పోషణ్ అభయాన్ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా వ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు పోషక ఆహారాల ద్వారా మధ్యాహ్న భోజనం అందజేస్తూ, అలాగే గర్భిణీలకు, బాలింతలకు, రక్తహీనత లోపం లేకుండా పోషణ్-2.0 పోషక విలువలు కలిగించే పౌష్టికాహారని నెలకొకసరి అందజేస్తున్నారు. మహిళ సాధికారతే ధ్యేయంగా ఇలాంటి మంచి పథకాలు ప్రవేశపెడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని లబ్ధిదారు నందినీ తెలుపుతూ....

(వాయిస్ 25 సెకన్లు)

====================

వరి, చెరకు, మామిడి పంటతో పాటు లాభసాటి వాణిజ్య పంటలు సాగు వైపు రైతుల దృష్టి మరల్చాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో ఖరీఫ్ – 2025 కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రకృతి వ్యవసాయం పంట ఉత్పత్తుల స్టాల్ ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... జిల్లాలో రైతులకు పంట మార్పిడి విధానం, బహుళ పంటల సాగు, మార్కెటింగ్ సౌకర్యం, నాణ్యమైన విత్తనాల సరఫరా, భూసారం, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై అధికారులు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, రైతుల నుండి సలహాలు, సూచనలు స్వీకరించాలని తెలియజేశారు.

====================

విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని వై.ఎస్. ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు డిమాండ్ చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ యువత పోరు పేరుతో భారీ నిరశన కార్యక్రమం చేపట్టింది. ఈ సంధర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు విస్మరించి కేవలం వారి కార్యకర్తలు, నాయకుల కోసం ప్రచార ఆర్భాటాలు చేస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కరంలో తొమ్మిది నెలల కాలంలో వైఫల్యం చెందారని విమర్శించారు.

====================

మెకట్రానిక్స్ లో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జర్మనీ భాష నేర్పించి శిక్షణ ఇవ్వనున్నామని ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శ్రీకాకుళం జిల్లా అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. “2 కామ్స్” సంస్థతో కలిసి ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ శిక్షణను నిర్వహిస్తోందని తెలియజేశారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 25వ తేదీ లోపు naipunyam.ap.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

====================
====================